కోతకు గురైన కాల్వ

- కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- గోదావరి జలాలు వదిలితే గండ్లు పడే అవకాశం


రామన్నగూడెం శివారులో కోతకు గురవుతున్న 71డీబీఎం కాల్వ

అర్వపల్లి : ఎస్సారెస్పీ రెండోదశ కాల్వకు కొన్నేళ్లుగా ఎలాంటి మరమ్మతులు లేకపోవడంతో ఎక్కడికక్కడ కోతలకు గురవుతోంది. ఈ కాల్వల నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇంత వరకు శాశ్వత మరమ్మతులు చేపట్టలేదు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులుదులుపుకున్నారే తప్ప పెద్ద మరమ్మతులు ఏమి చేపట్టకపోవడంతో చివరి వరకు నీరు సక్రమంగా రాని పరిస్థితి ఏర్పడింది. ఈ కాల్వలకు లైనింగ్ చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు లైనింగ్ పనులే చేపట్టలేదు. దీంతో గోదావరి జలాలు వదిలిన ప్రతిసారీ కాల్వలు కోతకు గురికావడం, గండ్లు పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

71డీబీఎం కాల్వ పరిధిలో..

ఎస్సారెస్పీ రెండోదశలో భాగంగా 71డీబీఎం కాల్వ ప్రధానమైనది. ఈ కాల్వకింద లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ కాల్వ పొడవు 68కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇందులో కొత్తపల్లి, పర్సాయపల్లి, అడివెంల తదితర ప్రాంతాలలో కేవలం 6 కిలోమీటర్లు మాత్రమే కాల్వ లైనింగ్ పనులు చేసి వదిలేశారు. మిగతాదంతా లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఈ కాల్వ ఐదారుచోట్ల కోతకు గురైంది. డ్రాప్‌లు ఉన్నచోట వరద ఎక్కువగా వచ్చి దెబ్బతిన్నాయి. ప్రగతినగర్ నుంచి పెన్‌పహాడ్ మండలం వరకు పలుచోట్ల కాల్వ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కాగా భారీ వర్షాలకు ఈ కాల్వ మరింత దెబ్బతినే అవకాశం ఉంది. జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెం శివారులో బక్క చెలక సమీపంలో 71డీబీఎం కాల్వ భారీ వర్షాలకు కోతకు గురైంది. గోదావరి జలాలు వదిలితే ఈ కాల్వకు గండిపడే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి నీటి విడుదలకు ముందే ఈ కాలువలకు మరమ్మతు చేయించాలని కాల్వ ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అలాగే శాశ్వతంగా లైనింగ్‌ను నిర్మించాలని కోరుతున్నారు.

కాల్వలు అధ్వానంగా ఉన్నాయి



ఎస్సారెస్పీ కాల్వలు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయి. కాల్వలు కంపచెట్లతో నిండి నీరు సక్రమంగా ప్రవహించక పలు చోట్ల కోతకు గురై ప్రమాదకరంగా ఉన్నాయి. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం



71డీబీఎం కాల్వ పరిధిలో పలుచోట్ల కట్టలు కోతకు గురికాగా మరమ్మతుల కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రామన్నగూడెం శివారులో కాల్వ డ్రాప్ వద్ద కోతకు గురైంది. అయితే మరమ్మతు కోసం రూ.35లక్షలతో ప్రతిపాదన పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ప్రస్తుతం నీరు వదిలినా కాల్వకు ఎలాంటి నష్టం జరగదు.

– హరిస్వరూప్, నీటి పారుదల శాఖ ఏఈ

పేటలో భారీ వర్షం.. జలమయమైన రోడ్లు


సూర్యాపేటలో రోడ్డుపై నిలిచిన నీరు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో శుక్రవారం సాయంత్రం గంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన వీధులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులు కూడా వస్తుండటంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

చివ్వెంల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రహదారులు జలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో విద్యుత్ అధికారులు విద్యుత్‌ను నిలిపివేశారు. రాత్రి కూడా వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు సూచించారు.


సూర్యాపేటలో కురుస్తున్న వర్షం


సూర్యాపేటలో జలమయమైన రోడ్డు

క్లుప్తంగా

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రి శ్రీధర్‌ను కలిసిన ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : హైదరాబాద్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీధర్‌కు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ కారిడార్‌ను త్వరగా ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కొత్త పరిశ్రమలు నెలకొల్పేలా ప్రోత్సహించాలని కోరారు.

పార్ట్‌టైం టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

తుంగతుర్తి : సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సూర్యాపేటలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతకు పార్ట్‌టైం టీచర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమకు వేతనాలు పెంచి, రెగ్యులర్ టీచర్లుగా పరిగణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం టీచర్లు రమేష్, పద్మ, అనిత పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ


విగ్రహాలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

తిరుమలగిరి : ప్రజలందరూ మట్టి వినాయకుడి విగ్రహాలను వాడి పర్యావరణ పరి రక్షణకు తోడ్పడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ అన్నారు. శుక్రవారం ఆమె మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.బుచ్చిరాములు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

తుంగతుర్తి : కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు తమ సంస్థ ముందుంటుందని బౌ అండ్ యారో స్వచ్ఛంద సంస్థ వైస్ చైర్మన్ కె.శబరీష్ అన్నారు. మండల పరిధిలోని వెంపటిలో ఇటీవల వర్షాలకు గ్రామానికి చెందిన భువనగిరి లక్ష్మీనారాయణ ఇల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబానికి ఒక నెలకు సరిపోను నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సీఈఓ మణికంట, కోఆర్డినేటర్ శశిధర్, వలంటీర్లు కేశగాని మహేశ్వర్, చింతకింది సోమనారాయణ, సన్నాయిల సైదులు, పులుసు శేఖర్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చివ్వెంల : అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల దురాజ్‌పల్లి గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేటకు చెందిన కుంచం పాపయ్య(44) కోదాడ పట్టణ శివారులోని క్రషర్ మిల్లులో పనిచేస్తున్నాడు. శుక్రవారం తన స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. దురాజ్‌పల్లి గ్రామ శివారులోకి రాగానే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో పాపయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శంభయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నష్టపరిహారం చెల్లించాలి

నూతనకల్ : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పంటలు వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లిందని తెలి పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటల నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దెల రామ్మూర్తి, వెంకట్‌రెడ్డి, రవి, లింగయ్య పాల్గొన్నారు.

ఖమ్మం వరద బాధితులకు చేయూత


వంట సామగ్రి వాహనాన్ని ప్రారంభిస్తున్న సెంటినరీ బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి ప్రభుదాస్

సూర్యాపేట : ఖమ్మంలోని వరద బాధితులకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ స్త్రీల సమాజం అధ్యక్షురాలు పెదపంగు కవిత చేయూత అందిస్తున్నారు. దాదాపుగా 100కుటుంబాలకు వారం రోజులకు సరిపోను నిత్యావసర వంట సామగ్రిని సమకూర్చారు. వంట సామగ్రితో ఖమ్మం వెళ్తున్న వాహనాన్ని శుక్రవారం సెంటినరీ బాప్టిస్ట్ చర్చి స్త్రీల సమాజం అధ్యక్షురాలు పెదపంగు కవిత, సంఘకాపరి ప్రభుదాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ప్రభావంతో సర్వం కోల్పోయిన ప్రజలకు తమ వంతుగా వారం రోజులకు సరిపోను వంట సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంటినరి బాప్టిస్ట్ చర్చి అధ్యక్షులు జాన్ సుమిత్ర, కోశాధికారి హుబర్ట్, మత్రి పోలేనెస్, వల్దాసు ఉపేందర్, శ్రీనివాస్, సెంటినరీ బాప్టిస్ట్ స్త్రీల సమాజం ఉపాధ్యక్షురాలు బొజ్జ విజయ, సైమన్, కార్యదర్శి సువార్త రత్నం, సహాయ కార్యదర్శి వల్దాసు అరుణ, కోశాధికారి తులసి జఫన్య, ఆదరణ ప్రాజెక్టు లీడర్ జి. శాంత, బైబిల్ ఉమెన్స్ జలగం ఎలిజబెత్, కొండ రాణి, గోగుల కలమ్మ, దైద రమణ, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ బలోపేతానికి పాలకవర్గం కృషి


మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ సైదులు

తుంగతుర్తి : తుంగతుర్తి రైతు సేవా సహకార సంఘం సొసైటీని ఉమ్మడి జిల్లాలోనే అన్ని రంగాల్లో ముందుంచేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీలో సొసైటీలో 830 మంది రైతులకు గాను రూ.5కోట్ల 8 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 460 మంది రైతులకు గాను రూ.3కోట్లకు పైగా రుణమాఫీ పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులందరికీ ఐదు రోజుల్లో రుణమాఫీ పంపిణీ చేసేందుకు సిబ్బంది పనిచేస్తోందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, డీఏపీ సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. పాలకవర్గ సభ్యులు రైతులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ మోడెం శ్రీలతఉపేందర్, సొసైటీ సీఈఓ వందనపు వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, రామచంద్రు, భిక్షంరెడ్డి, మజీద్, యాకయ్య, చాంప్లా, ఈదప్ప, రామనర్సమ్మ, పూలమ్మ, సిబ్బంది యాదగిరి, ఉమేష్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

భైరు మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తాం


మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్

పెన్‌పహాడ్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భైరు మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తామని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్ అన్నారు. శుక్రవారం భైరు మల్లయ్య 4వ వర్ధంతిని పురస్కరించుకొని చీదెళ్లలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మిక సంఘం ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మల్లయ్య కల్లుగీత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తన జీవితాంతం పరితపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు దొంతగాని రాంబాబు, తుమ్మల శ్రీనివాస్, గుడిపూడి వీరయ్య, సురభి వెంకటేశం, అంజయ్య, తొండల గోపయ్య, పెద్ద మామిడి పరశురాములు, సొంటి శ్రీను, దేశగాని సోమయ్య, రాజీవ్ గాంధీ, సత్యనారాయణ, కీర్తి శ్రీను, అన్నెం చిన్న వెంకటేశం, బాల జానయ్య పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : ఆత్మ రక్షణ కోసం కరాటే అవసరమని సూర్యాపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోతి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ అభినయ్ అన్నారు. ఎంఎస్ఆర్ కిడ్స్ పాఠశాలలో 100 నెలలపాటు కరాటే నేర్చుకున్న 30 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రశంసాపత్రాలు, బెల్ట్‌లు పంపిణీ చేశారు. 10 మంది ఎల్లో, 10 మంది ఆరేంజ్, 10 మంది గ్రీన్ బెల్ట్‌లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమన్ చోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే టూ అకాడమీ మాస్టర్ రమణ, ప్రిన్సిపల్ ప్రభాకర్, కరస్పాండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న విమల

తిరుమలగిరి: అనంతారం ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ విమల మాట్లాడారు. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా, సామాజికంగా బాగుండటమే ఆరోగ్యం అని చెప్పారు. విద్యార్థులు మానసికంగా ఆందోళన చెందకుండా యోగా, ధ్యానం లాంటివి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ బాలరాజు మాట్లాడుతూ యువత మద్యం, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాల బారిన పడకుండా సత్ప్రవర్తనతో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేముల బాలరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నాగారం: విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని ఆర్‌బీఎస్‌కే డాక్టర్ గౌతం అన్నారు. శుక్రవారం పసునూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువును పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ కె.గీత, ఫార్మసిస్ట్ సతీష్, ప్రధానోపాధ్యాయులు బింగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెలుగు వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

మద్దిరాల : మండల పరిధిలోని గామాల్లో రుణమాఫీ కాని రైతుల ఇంటింటి సర్వే కొనసాగుతోంది. గుమ్మడవెల్లి గ్రామంలో నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మహేష్‌గౌడ్ ఎంపిక హర్షణీయం

మద్దిరాల : పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను అధిష్టానం ఎంపిక చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ గుర్తింపు ఇస్తుందని మరోసారి నిరూపించిందని అన్నారు. అత్యధిక ఓటర్లు ఉన్న బీసీ నేతలకు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించడం పట్ల మండల బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పచ్చిపాల వెంకన్న, మద్దెల భిక్షపతి, మాన్‌సింగ్, కొమ్ము అంజయ్య, శ్యాంరెడ్డి, నాగేందర్, నలమాస ఉపేందర్, మద్దెల యాకయ్య, చెన్ను, సుల్తాన్, నరేష్, కాశయ్య, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహార వారోత్సవాల్లో పాల్గొన్న సూపర్‌వైజర్ జ్యోతి, చిన్నారులు, తదితరులు

సూర్యాపేట రూరల్ : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు జరిగే పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామన్నగూడెంలో అంగన్‌వాడీ విద్యార్థుల పోషణ్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా పోషకాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యాదగిరి, పంచాయతీ కార్యదర్శి కోటిరెడ్డి, నాయకులు ఆరాల వీరమల్లు, సైదులు, లక్ష్మి, గర్భిణులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్ పుష్ప పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


సూర్యాపేటటౌన్ : మాట్లాడుతున్న అన్నపూర్ణ


అర్వపల్లి : గణేష్ విగ్రహాలతో రేఖ, నిర్వాహకులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలో గణేష్ నవరాత్రోత్సవాలను నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శనివారం నుంచి నిర్వహించనున్న గణేష్ ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో డీఎస్పీ రవి ఆధ్వర్యంలో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన పోలీస్ భద్రత ఉంటుందని తెలిపారు. నిమజ్జనం అయ్యే వరకు ప్రతి గణేష్ మండపానికి 24గంటలు భద్రత కల్పిస్తామన్నారు. ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, సీఐలు రాజశేఖర్, సురేందర్, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్వపల్లి : గణేష్ నవరాత్రోత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ కోరారు. రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు 25గణేష్ విగ్రహాలను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు గణేష్ నవరాత్రోత్సవాలకు విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, రాజశేఖర్, కుంభం మధు, శివ, ఉప్పలయ్య, గణేష్ మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

నాగారం : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ ఎం.ఐలయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలను ఉల్లంఘించవద్దని ఉత్సవ కమిటీలకు సూచించారు. ఎవరైనా ప్రజాభద్రతకు, శాంతికి భంగం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ నకిరేకంటి రవి

పెన్‌పహాడ్ : ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలని మండల విద్యాధికారి నకిరేకంటి రవి అన్నారు. శుక్రవారం అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూర్యాపేట, పెన్‌పహాడ్ మండలాల తెలుగు భాషోపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మాతృభాష మాధుర్యాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు. అనంతరం మండల నోడల్ అధికారి వస్రాం నాయక్ మాట్లాడారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెంపొందిస్తే ఇతర భాషలపై పట్టు సాధిస్తారని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు తమ సత్తాచాటే లాగా ఉపాధ్యాయులు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె. మల్లారెడ్డి, ఆర్పీలు గోవర్ధనచారి, చిట్యాల ప్రదీప్, సీఆర్పీలు మామిడి సైదయ్య, సూర్యాపేట, పెన్‌పహాడ్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

అర్వపల్లి : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎం. బిచ్చునాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, హెల్త్ అసిస్టెంట్‌లు కుంభం వీరయ్య, సైదమ్మ, శకుంతల, హెచ్‌ఎం ఇందిర, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగారం : డి.కొత్తపల్లికి చెందిన ఆవుల గంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్‌లు మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, కృష్ణమూర్తి, బయ్యం లింగయ్య, కాసం వీరయ్య, నాతి ఉప్పలయ్య, రాజ్‌కుమార్, సోమలింగం, శ్రీధర్, దండోల్ ధనుంజయ్, వీరాచారి పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు

తుంగతుర్తి : తుంగతుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రామన్నగూడెం తండాకు చెందిన గుగులోతు అరుణ శుక్రవారం పాము కాటుకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కానీ అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం సూర్యాపేటకు తరలించేందుకు ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చివరకు ప్రైవేటు వాహనంలో సూర్యాపేటకు తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వి.రమేష్, ఎ.ఉపదేశ్, ఎ.వసుంధర, వి.శ్రీలతలను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీ సహజమన్నారు. విద్యార్థి జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘుపతి, ఉపాధ్యాయులు గురువయ్య, శ్రీరాములు, మధూకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ


ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

తుంగతుర్తి : వెంపటి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం రూ.25వేల విలువగల ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వెంకట్రామనర్సమ్మ మాట్లాడారు. విద్యార్థులకు తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఐడీ కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను కార్పొరేట్ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య, రవీందర్, ఆంజనేయులు, మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.